# వాన్‌పిక్‌ను వెంటనే ఆపాలి

## ప్రచారయాత్రను జయప్రదం చేయండి

ప్రజలను భిక్షగాళ్లను చేసి రాష్ట్రాన్ని 'అభివృద్ధి' చేసే కోస్టల్ కారిడార్ ప్రణాళికలో భాగంగా గుంటూరు, ప్రకాశం జిల్లాలలో ప్రభుత్వం నెలకొల్పుతున్న 'వాన్‌పిక్' ప్రాజెక్టును వ్యతిరేకించవలసిందిగా అందరికీ పిలుపునిస్తున్నాం.

ఇది ఒక ఫ్యాక్టరీకోసమో ఒక ఓడరేవు కోసమో జరుగుతున్న భూసేకరణకాదు. విదేశీ పెట్టుబడిదారీ కంపెనీలూ, వారి సరసన వేగంగా చేరుతున్న టాటా, జిందాల్, రిలయన్స్, మిట్టల్ వంటి కంపెనీలూ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టాలంట. వారు పెట్టుబడులు పెట్టాలంటే మౌలిక సదుపాయాలు (నిరంతరాయమైన విద్యుత్తు, విశాలమైన రోడ్లు, దగ్గరిలో ఓడరేవులు, విమానాశ్రయాలు, నిరాటంకంగా నీటి సరఫరా) పుష్కలంగా ఉన్న విశాల భూభాగం రెడీగా ఉండాలంట. అందుకోసం సముద్రతీరం వెంబడి అన్ని సదుపాయాలూగల 'కారిడార్' ఏర్పాటు చేయనున్నారు. వాన్‌పిక్ పేరిట 28వేల ఎకరాల కారిడార్ దీంట్లో భాగంగానే ఏర్పడుతున్నది.

ఈ కారిడార్ ఏర్పడుతున్నది చంద్రమండలం మీదనో మనుషులు లేని ఎడారిలోనో కాదు. ఇక్కడ ఆద్యంతం గ్రామాలున్నాయి. వాళ్లకు పనికల్పించి తిండిపెడుతున్న పొలాలున్నాయి. చేపలవేటకు అనువయిన తీరప్రాంతం ఉంది. సముద్రంలో కలిసే ఏర్లున్నాయి. ఇది కూడ ఒక ఆర్థిక వ్యవస్థే. ఉపాధి, ఉత్పత్తి, సంపద అనేవి వాన్‌పిక్ ద్వారా ఇక్కడ కొత్తగా ప్రవేశించడం లేదు. ఎప్పటినుండో ఉన్నాయి. అందులో ఎన్నో లోపాలున్నమాట నిజమే, అభివృద్ధికి ఆస్కారమున్న మాటా నిజమే. ఇక్కడ పేదరికం చాలా ఉన్నమాట నిజమే, దానిని పోగొట్టవలసిన అవసరం ఉన్నమాటా నిజమే. కానీ దానిని మొత్తంగా తుడిచిపెట్టి స్థానికులకు నాలుగు దినాలు మట్టి పని కల్పించడం తప్ప వేరే ఏ ప్రయోజనం ఇవ్వని పారిశ్రామిక కారిడార్‌ను నెలకొల్పడం ఎవరి మేలుకోసం? ఇప్పటిదాకా ఈ గ్రామాల ఆర్థిక వ్యవస్థలో మార్పంటూ వస్తే అది ప్రజలు చేసుకున్నదే. చాలా సంవత్సరాలు వర్షాభావంవల్ల వ్యవసాయంలో ఎదుగుదల లేక నష్టపోయిన ప్రజలు గడచిన నాలుగేళ్ల కాలంలో మెరుగుపడిన వర్షాలనుండి ప్రయోజనం పొందడానికి బోర్లు వేసుకుని వరి, వేరుశెనగ తదితర పంటలు సమృద్ధిగా పండించుకుంటున్నారు. సరిగ్గా ఈ సమయంలో వాన్‌పిక్ వచ్చింది.

'కోస్టల్ కారిడార్' కోసం ప్రజల భూములు సేకరించడం లేదనీ కేవలం విశాలమైన రోడ్లు వేస్తున్నామనీ దానిని ప్రతిపక్షపార్టీలు వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నాయనీ స్వయాన ముఖ్యమంత్రి, ఆయన అనిందే తడవు ఓడరేవుల మంత్రి అన్నారు. ఇది అబద్ధం అని భూ సేకరణ నోటిఫికేషన్ చెప్తుంది. ఈ సంవత్సరం జూలై 13 నాడు అడవుల దీవిలో భూసేకరణ నిమిత్తం ప్రచురించిన నోటిఫికేషన్, నిజాంపట్నం ఓడరేవుకోసం, పారిశ్రామిక కారిడార్ కోసం భూములు తీసుకుంటున్నామని అంటుంది. డిండి గ్రామంలో వ్యవసాయ భూములే కాదు, ఏడు పల్లెలు మొత్తంగా తీసేసుకుంటున్నది అక్కడ రాగల సూపర్ థర్మల్ కేంద్రంకోసం అని నోటిఫికేషన్ అంటుంది. తెలిసీ పెద్దలు అబద్ధాలు చెప్తే ఏం చేయాలి?

ఎకరం 50 వేలకు అమ్ముడుపోని భూములకు మాట్రిక్స్ కంపెనీ 3 లక్షల దాకా ఇవ్వడానికి సిద్ధపడుతున్నదనీ అమ్ముకుంటే లాభమేకదా అనీ కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. భూములు అమ్ముకుందామని చూస్తున్నవారికి 50 వేల బదులు 3 లక్షలిస్తే గొప్ప విషయమే కానీ బలవంతంగా భూములు సేకరిస్తూ '50 వేలు చేయని భూమికి 3 లక్షలిస్తున్నాం కాబట్టి నువ్వు అభ్యంతరం చెప్పడం తప్పు' అంటే అర్థం ఏమిటి? ఇవాళ ఇక్కడ భూమి చవకే

అయి ఉండవచ్చు. కానీ 28 వేల ఎకరాలు సేకరించిన తరువాత ఆ డబ్బు తీసుకున్న రైతులు పరిసర గ్రామాలలో భూములు కొనుక్కుందామని పోతే ధరలు పెరగవా? ఇప్పటికే వాన్‌పిక్ ప్రాజెక్టు రాబోతోందని తెలిసి చుట్టుపక్కల గ్రామాలలో భూముల ధరలు బాగా పెరిగిపోయాయి. ఎకరం పోయిన వారు 3 లక్షలిచ్చినా కూడా ఇంకో ఎకరం కొనుక్కోలేరు.

అంతేకాక ఎకరానికి 3 లక్షలిస్తామని ముందుకొస్తున్నది ప్రభుత్వం కాదు. డిండి దగ్గర థర్మల్ ప్లాంటు నెలకొల్పబోయే మాట్రిక్స్ అనే కంపెనీ. ఆ భూమి తనకు కావాలని ప్రభుత్వం అంటుండగా వీరెవరు మేము కొనుక్కుంటామని దళారులను పంపి రైతులతో బేరాలు పెట్టడానికి? మాట్రిక్స్ కంపెనీ కోసమే ప్రభుత్వం భూసేకరణ చేస్తున్నట్టయితే దానికి వేరే పద్ధతి అనుసరించాలి, ఈ పద్ధతి కాదు. చట్టమంటే ఖాతరు లేకుండ వ్యవహరించడం మన పాలకులకెంత అలవాటయి పోయిందనడానికి ఇదొక మచ్చుతునక.

మరొకటేమిటంటే మాట్రిక్స్ కంపెనీవారు కేవలం రైతుల స్వంత భూములే కాక అసైన్‌మెంట్ పట్టాలు (డి ఫారం పట్టాలు) ఇచ్చిన భూములను కూడా కొంటున్నారు. రైతులకిచ్చినదానిలో సగం రేటుకు కొంటున్నారు. తెలియక కొందరు పేదలు అమ్ముతున్నారు కూడ. అసైన్‌మెంట్ భూముల అమ్మకం, కొనుగోలు చెల్లవని తెలిసీ బహిరంగంగా జరుగుతున్న ఈ వ్యవహారాన్ని అధికారులు ఎందుకు ఆపడం లేదు? రైతుల స్వంత భూములకెంత నష్టపరిహారం ఇస్తారో అసైన్‌మెంట్ భూములకూ అంతే ఇవ్వాలని మన రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చిఉండగా సగమే ఇవ్వడాన్ని ఎందుకు అనుమతిస్తున్నారు?

రైతులు, డి పట్టా ఉన్న పేదలే కాక భూమిలేని కూలీలు వేలమంది ఈ గ్రామాలలో ఉన్నారు. పదిమందికైతే వాళ్లకు ఎక్కడయినా పనులు దొరుకుతాయని అనుకోవచ్చు. వేల మంది ఒక్కసారిగా జీవనం కోల్పోతే అందరికీ పనులెక్కడ దొరుకుతాయి? మొదట్లో ఈ 'కారిడార్'లో రోడ్లు వేసేపని, కార్యాలయాలు కట్టేపని ఉంటుంది. అందులో దిన కూలీలుగా కొంతమందికి పని దొరకగలదు. తరువాత వారు ఏమవుతారు? తుఫాను వచ్చినా మా ఊరికి ప్రమాదం లేదని అదవల గ్రామస్తులు ఆ ఊరికీ పక్కనే ఉన్న సముద్రానికీ మధ్యఉన్న ఎత్తయిన ఇసుక దిబ్బలను చూపించి అంటుంటారు. ఈ తుఫాను మాత్రం వారిని దిక్కులేని పక్షులను చేస్తుంది.

జీవనానికి సంబంధించిన ఈ సమస్యలే కాక పర్యావరణానికి సంబంధించినవీ ఉన్నాయి. నిజాంపట్నంనుండి ఎగువకు కర్లపాలెం, బాపట్ల మండలాలలో వాన్‌పిక్ కోసం సేకరిస్తున్న భూమిలో కూడా అడవులున్నాయి. అవి క్షీణించిపోతున్నాయని చెప్పి వాటిని పునరుద్ధరించడానికి అటవీశాఖ రెండేళ్లుగా లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నది కూడ. అటవీ శాఖ ప్రభుత్వానికి చెందినదే. అయినా ప్రభుత్వమే ఆ ప్రయత్నాన్ని వమ్ము చేస్తూ ఇప్పుడు మడ అడవులను వాన్‌పిక్ పారిశ్రామిక ప్రాజెక్టుకు కేటాయిస్తున్నది. వాటిని దున్నేసి నేలను సాపు చేస్తారని వేరే చెప్పనవసరం లేదు. తీరప్రాంతాన్ని తుఫానులనుండి రక్షించడంలో జలజీవాల పునరుత్పత్తిలో కూడా అడవులకు ముఖ్యమైన పాత్ర ఉంది. అది పూర్తిగా ధ్వంసం అవుతుంది. ఇదేమిటని ఆ ప్రాంతంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఒక అటవీశాఖ అధికారిని అడిగితే ఆయన తలపట్టుకొని 'ఏం చేయమంటారు చెప్పండి? వాళ్లు పార్లమెంటును దున్నేసి పరిశ్రమలకు అప్పగించినా అడగగలవారెవరు?' అంటాడు.

డిండి దగ్గర రాబోయే సూపర్ థర్మల్ కేంద్రం విపరీతమైన బూడిద కాలుష్యానికీ విషపదార్థాలకూ కారకం కాగలదు. అది 4500 మెగావాట్ల కేంద్రమని ఒకరు, 6000 మెగావాట్ల కేంద్రమని ఒకరు అంటున్నారు. ప్రజలకు సరయిన సమాచారం సహితం ఇవ్వని దౌర్భాగ్యస్థితిలో ఉన్నాం. ఏదయినా ఇది కృష్ణపట్నం థర్మల్ కేంద్రంకంటే పెద్దది, రాష్ట్రంలోనే అతిపెద్దది. దానినుండి బూడిద, సల్ఫర్ (గంధకం), విషపదార్థమైన మెర్క్యూరీ (పాదరసం)

వెలికివస్తాయి. బూడిదను బురదచేసి నిలువచేసే బూడిద చెరువుల నుండి ఎండకు ఎండిన బూడిద గాలికి కొట్టుకొచ్చి ఊర్లపైన, పొలాలపైన, సముద్రంపైన నిత్యం పడుతుంటుంది. పొగ గొట్టాల నుండి పైకి వచ్చే బూడిదకూడ అంతే. పంటలు, సముద్రంలో మత్స్య సంపద విపరీతంగా దెబ్బతింటాయి.

నిజాంపట్నం పోర్టుకూడ మత్స్య సంపదను, మత్స్యకారుల జీవనాన్నీ బాగా దెబ్బతీస్తుంది. పోర్టు కట్టడానికి అవసరమైన మట్టిని ఒడ్డుకు సమీపంలో సముద్రం క్రింది నుండి తవ్వి తీస్తారు. దాని ఫలితంగా సముద్ర జలం కల్లోలానికి గురయి జలజీవాల పునరుత్పత్తి దెబ్బతింటుంది. పోర్టు కట్టిన తరువాత నిత్యం వచ్చిపోయే ఓడలు తెచ్చే కాలుష్యం ఫలితం కూడా ఉంటుంది. 'మంత్రి మావాడు కాబట్టి మాకేం అన్యాయం జరగదు' అన్న విశ్వాసంతో మౌనంగా ఉన్న నిజాంపట్నం మత్స్యకారులు పునరాలోచించుకునే రోజు రాగలదు. ఇప్పుడు ఏ మంత్రీ ప్రజలవాడు కాదు. అందరూ పెట్టుబడిదారీ కంపెనీలవాళ్లే.

- వాన్‌పిక్ ప్రాజెక్టును వెంటనే ఆపాలి
- వ్యవసాయం, పశుపోషణ, చేపలవేట తదితర సకల గ్రామీణ వృత్తుల బాగోగులతో నిమిత్తం లేని మూర్ఖమైన పారిశ్రామికీకరణ స్థానంలో హేతుబద్ధమైన ఆర్థిక అభివృద్ధి విధానాలు రూపొందించాలి.

**7, నవంబర్ 2008.**

**– మానవ హక్కుల వేదిక**

**Human Rights Forum (HRF)**

గుంటూరు జిల్లాశాఖ

నవంబర్ 15వ తేదీన నిజాంపట్నం మండలంలోని అదవల నుండి నక్రావారిపాలెం దాకా, ఆపైన సాగే ప్రచార యాత్రను జయప్రదం చేయండి.